క్లుప్తంగా

సామాజిక సేవలతోనే గుర్తింపు: వెంకటయ్య



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న వెంకటయ్య

మిరుదొడ్డి(దుబ్బాక): సామాజిక సేవలే సమాజంలో మంచి గుర్తింపునిస్తాయని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య అన్నారు. భూంపల్లి ఆటో యూనియన్ సభ్యులు ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వేసవిని దృష్టిలో ఉంచుకుని ప్రయాణికుల దాహార్తిని తీర్చడం కోసం ఆటో యూనియన్ సభ్యులు ముందుకు రావడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ బుచ్చయ్య, భూంపల్లి మాజీ ఉప సర్పంచ్ ప్రభాకర్, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

చెక్‌డ్యామ్ నిర్మాణానికి స్థల పరిశీలన



స్థలాన్ని పరిశీలిస్తున్న అధికారులు

కోహెడరూరల్(హుస్నాబాద్): మండలంలోని బస్వాపూర్‌లో చెక్‌డ్యామ్ నిర్మాణానికి మోయ తుమ్మెద వాగు ఇరిగేషన్ ఎస్ఈ సుమతి శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా డ్యామ్ నిర్మించే స్థలాన్ని పరిశీలించారు. మంత్రి పొన్నం ప్రభాకర్‌కు ఇటీవల బస్వాపూర్ రైతులు చెక్‌డ్యామ్ నిర్మించాలని వినతిపత్రం అందించారు. దీంతో మంత్రి పొన్నం ఆదేశాలతో ఇరిగేషన్ అధికారులు పరిశీలించారు. ఆమె వెంట ఏఈ రవిష్ తదితరులు ఉన్నారు.

రైతులు సహకరించాలి



మాట్లాడుతున్న ఆర్డీఓ రామూర్తి

కోహెడరూరల్(హుస్నాబాద్): గౌరవెల్లి ప్రాజెక్టు డీ7, డీ8 లింక్ కెనాల్‌కు సంబంధించి భూమిని కోల్పోతున్న రైతులు సహకరించాలని ఆర్డీఓ రామ్మూర్తి అన్నారు. మండలంలోని వింజపల్లిలో శుక్రవారం భూసేకరణ కోసం రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వింజపల్లి పరిధిలో 8 ఎకరాల 17 గుంటల భూమి అవసరం ఉందన్నారు. ముందుగ రైతుల నుంచి అభ్యంతరాలు స్వీకరించి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఏసీపీ సతీశ్, తహసీల్దార్ సురేఖ, ఆర్ఐ ఎల్లయ్య తదితరులు ఉన్నారు.

శాస్త్రీయ దృక్పథం అవసరం

నంగునూరు(సిద్దిపేట): విద్యార్థులు బట్టీ చదువులు కాకుండా శాస్త్రీయ దృక్పథం అలవర్చుకొని కొత్త ఆలోచలతో ముందుకు సాగాలని ఎంఈఓ దేశిరెడ్డి పిలుపునిచ్చారు. జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం నర్మేట కాంప్లెక్స్ పరిధిలోని పాఠశాల విద్యార్థులు సైన్స్ ఎగ్జిబిషన్ నిర్వహించారు. ఈ సందర్భంగా పర్యావరణం, వర్షపు నీటి వినియోగం, సోలార్ విద్యుత్ తయారీకి సంబంధించి 90కు పైగా ప్రయోగాలను ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఎంఈఓ, ఆయా పాఠశాలల హెచ్ఎంలు విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో హెచ్ఎంలు రామస్వామి, శ్రీనివాస్, సత్యనారాయణ, మనీష్‌కుమార్, అశోక్, గణపతి, త్రివిక్రమశర్మ, జనార్దన్‌రెడ్డి, కనకయ్య తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

గజ్వేల్‌రూరల్: పట్టణంలోని బాలుర ఎడ్యుకేషన్ హబ్‌లోగల ప్రభుత్వ బాలుర డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు బోధించేందుకు అతిథి అధ్యాపకుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ నిఖత్ అంజుమ్ తెలిపారు. శుక్రవారం ఆమె మాట్లాడుతూ ఈ విద్యాసంవత్సరానికి గానూ కళాశాలలో ఎకనామిక్స్ సబ్జెక్టును బోధించేందుకు ఒక ఖాళీ ఉందన్నారు. అభ్యర్థులు పీజీ(ఎంఏ ఎకనామిక్స్)లో 55శాతం, ఎస్సీ, ఎస్టీలకు 50శాతం మార్కులుండాలని, అదే విధంగా నెట్, సెట్, పీహెచ్‌డీ చేసిన వారికి ప్రాధాన్యం ఉంటుందని చెప్పారు. ఆసక్తిగల అభ్యర్థులు 10లోగా కళాశాలలో దరఖాస్తు చేసుకోవాలని, 11న కళాశాలలో ఇంటర్వ్యూ నిర్వహిస్తామని తెలిపారు. మరిన్ని వివరాలకు కళాశాలలో సంప్రదించాలని సూచించారు.

మహిళలు అన్నిరంగాల్లో రాణించాలి

అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా శుక్రవారం ముందస్తుగా వేడుకలు నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా వివిధ పాఠశాలలు, కార్యాలయాల్లో మహిళలను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆటల పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలలో మహిళలు ఉత్సాహంగా పాల్గొన్నారు. ప్రతిభ చూపిన వారికి నిర్వాహకులు బహుమతులు అందజేశారు. అన్నిరంగాల్లోను రాణించాలని వక్తలు ఆకాంక్షించారు.

ఘనంగా ముందస్తు మహిళా దినోత్సవం



మిరుదొడ్డి(దుబ్బాక): కాసులాబాద్‌లో బహుమతులు అందుకుంటున్న మహిళలు



హుస్నాబాద్: మహిళలను సన్మానిస్తున్న రజిత



దుబ్బాకటౌన్: మహిళ ఉపాధ్యాయులను సన్మానిస్తున్న ప్రిన్సిపాల్



వర్గల్‌లో మహిళా టీచర్లకు సన్మానం



తొగుటలో మహిళా ఉద్యోగులతో తహసీల్దార్



దుబ్బాక: జిజ్ఞాస ప్రదర్శనలో..



మర్కూక్(గజ్వేల్): మర్కూక్‌లో...



సిద్దిపేట ఎడ్యుకేషన్: ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో..

నిర్వాసితుల సమస్యలపై సమరం

బీఆర్ఎస్ గజ్వేల్ నియోజకవర్గ ఇన్‌చార్జి వంటేరు ప్రతాప్‌రెడ్డి

గజ్వేల్: మల్లన్నసాగర్ నిర్వాసితుల సమస్యలను తీర్చకపోతే పెద్దఎత్తున ఉద్యమిస్తామని బీఆర్ఎస్ గజ్వేల్ నియోజకవర్గ ఇన్‌చార్జి వంటేరు ప్రతాప్‌రెడ్డి హెచ్చరించారు. శుక్రవారం వారి సమస్యలపై గజ్వేల్‌లోని ఐఓసీ (ఇంటిగ్రేటెడ్ ఆఫీస్ కాంప్లెక్స్) వద్దకు ర్యాలీ వెళ్లి ధర్నా నిర్వహించి ఆర్డీఓ వీవీఎల్ చంద్రకళకు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తానూ టీడీపీలో పనిచేసిన సమయంలో తనతో కలిసి ఏటిగడ్డకిష్టాపూర్‌లో నిర్వహించిన దీక్షల్లో పాల్గొని అండగా ఉంటానని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. ఆ విషయాన్ని రేవంత్‌రెడ్డి మరిచిపోకుండా నిర్వాసితుల సమస్యల పరిష్కారానికి రూ.100కోట్లు మంజూరు చేయాలన్నారు. అంతేకాకుండా లక్కీడ్రాలో డబుల్‌బెడ్రూం ఇళ్ల ఎంపికైన వారికి వెంటనే కేటాయించాలన్నారు. ఈ రెండు సమస్యలపై ఎంతటి పోరాటానికైనా సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు. తాము ఇచ్చిన వినతిపత్రంపై ప్రభుత్వం స్పందించపోతే వచ్చే నెలలో వేలాదిమందితో నిరాహార దీక్షలు చేపడతామన్నారు. అప్పటికీ పట్టించుకోకపోతే సచివాలయాన్ని దిగ్బంధిస్తామన్నారు. రాజమౌళి, జకీయొద్దీన్, నవాజ్‌మీరా, నాయకులు ఉప్పల మెట్టయ్య, గోపాల్‌రెడ్డి, రాజు, కనకయ్య, శ్రీనివాస్, బాలేష్, చందు తదితరులు పాల్గొన్నారు.



సమస్యలపై ఆర్డీఓకు వినతిపత్రం అందజేస్తున్న వంటేరు ప్రతాప్‌రెడ్డి

అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు

మాజీ ఎమ్మెల్యే కొమ్మూరి

చేర్యాల(సిద్దిపేట): కాంగ్రెస్ ప్రభుత్వంలో రేవంత్ రెడ్డి సారథ్యంలో అర్హులైన వారందరికీ ఇందిరమ్మ ఇళ్లు కేటాయిస్తామని మాజీ ఎమ్మెల్యే, జనగామ నియోజకవర్గ ఇన్‌చార్జి కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి అన్నారు. పైలట్ ప్రాజెక్టులో బాగంగా ఎంపికచేసిన మండల పరిధిలోని రాంపూర్‌లో శుక్రవారం ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి భూమిపూజ చేశారు. అనంతరం మాట్లాడుతూ ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం పైలట్ ప్రాజెక్టులో భాగంగా రాంపూర్ గ్రామాన్ని ఎంపిక చేసిందన్నారు. గ్రామంలో గుర్తించిన వారితో పాటు అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇళ్లు వచ్చేలా చూస్తానన్నారు. కార్యక్రమంలో నాయకులు ఆగంరెడ్డి, మల్లేశం, రవి, శ్రీకాంత్, కృష్ణాగౌడ్, రాకేష్‌కృష్ణ, సంతోష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



భూమిపూజ చేస్తున్న కొమ్మూరి

విద్యుదాఘాతంతో మహిళ మృతి

గజ్వేల్‌రూరల్: విద్యుదాఘాతంతో మహిళ మృతి చెందిన ఘటన మండల పరిధిలోని రంగంపేటలో శుక్రవారం చోటు చేసుకుంది. గ్రామస్తుల కథనం మేరకు.. గజ్వేల్ మండలం రంగంపేటకు చెందిన బోనగిరి నర్సింలు–బాలమణి (34) దంపతులకు కొడుకు, కూతురు ఉన్నారు. వ్యవసాయ పొలం వద్ద సాగు చేసిన స్వీట్‌కార్న్ పంటను చూసేందుకు వెళ్లింది. పంటకు రక్షణగా పొలం వద్ద ఏర్పాటు చేసిన విద్యుత్ తీగలు ప్రమాదవశాత్తు తగలడంతో బాలమణి అక్కడికక్కడే మృతి చెందింది. ఈ విషయం అందుకున్న కుటుంబ సభ్యులు ఘటనా స్థలానికి చేరుకొని పోలీసులకు సమాచారం అందించారు. బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు బాలమణి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గజ్వేల్ ప్రభుత్వాస్పత్రికి తరలించి పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

వేతనాలులేక కార్మిక కుటుంబాల పస్తులు

సీఐటీయూ జిల్లా నేత భాస్కర్

తొగుట(దుబ్బాక): మూడు నెలలుగా వేతనాలు లేక కార్మికుల కుటుంబాలు పస్తులుండాల్సి పరిస్థితి నెలకొందని సీఐటీయూ జిల్లా కోశాధికారి భాస్కర్ ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయం ఎదుట శుక్రవారం కార్మికులతో కలిసి ధర్నా నిర్వహించి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం కార్మికులకిచ్చిన హామీని నిలబెట్టుకోవాలన్నారు. ఎస్టీఓ కార్యాలయాల్లో నిలిచిపోయిన బకాయి వేతనాలను వెంటనే విడుదల చేయాలని, ఎండల తీవ్రత పెరిగినందున కార్మికుల భద్రతను దృష్టిలో పెట్టుకుని ఒక్కపూట పనికల్పించాలని కోరారు. ప్రభుత్వం గత జనవరి 19న విడుదల చేసిన రూ.149 కోట్లు చెక్కులు ఎస్టీఓ కార్యాలయాల్లో నిలిచిపోయాయని తెలిపారు. కార్మికులకు తక్షణమే వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల కార్మికులు పాల్గొన్నారు.

కార్మికుల ధర్నా

సిద్దిపేటరూరల్: జీపీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ నారాయణరావుపేట, సిద్దిపేటరూరల్ మండలాల ఎంపీడీఓ కార్యాలయాల ఎదుట కార్మికులతో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా నాయకుడు శ్రీకాంత్ మాట్లాడుతూ జీపి కార్మికులకు ప్రభుత్వ ఉద్యోగుల మాదిరిగా ప్రతీ నెలా 1వ తేదీకి వేతనాలు అందించాలన్నారు. కార్యక్రమంలో కార్మికులు దుర్గయ్య, రాజయ్య, భూపతి తదితరులు పాల్గొన్నారు.

పూలే గురుకులంలో పుస్తకావిష్కరణ

వర్గల్(గజ్వేల్): వర్గల్ జ్యోతిబాపూలే గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో శుక్రవారం 'రీసెంట్ అడ్వాన్స్ ఆన్ గ్రీన్ అండ్ సస్టైనబుల్ కెమిస్ట్రీ' అనే అంశంపై సదస్సు నిర్వహించారు. ఉస్మానియా యూనివర్సిటీ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ ఎ.కృష్ణంరాజు, రిటైర్డ్ ప్రొఫెసర్ ఎమ్ విటల్, బిట్స్ పిలాని ప్రొఫెసర్ సీహెచ్ మోహన్‌రావు, పూలే కళాశాలల జాయింట్ సెక్రెటరీ శ్యాంప్రసాద్ లాల్, ఏజీఓ లక్ష్మయ్య, ఆర్సీఓ గౌతంకుమార్, ప్రిన్సిపాల్ డాక్టర్ భాస్కర్‌రావు, రసాయనశాస్త్ర అధిపతి డాక్టర్ రాధ, డాక్టర్ జానకి తదితరులు సదస్సులో భాగస్వాములయ్యారు.

మోతాదు మించి వాడొద్దు

బెజ్జంకి(సిద్దిపేట): చేలకు మోతాదుకు మించి యూరియా వాడితే అగ్గి తెగులు సోకి దిగుబడి తగ్గుతుందని ఏఓ సంతోష్ సూచించారు. జిల్లా వ్యయసాయశాఖ అధికారి రాధిక ఆదేశాల మేరకు శుక్రవారం బెజ్జంకి పీఏసీఎస్‌లో యూరియా నిల్వలను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ యూరియా ఎక్కువ వాడటం వల్ల పంటకాల పరిమితి పెరుగుతుందన్నారు. అనంతరం గుండారంలో వరి పంటను పరిశీలించారు. కార్యక్రమంలో ఏఈఓ సాయిశంకర్, రైతు నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): పట్టణంలోని 11కేవీ ఎల్ఐసీ కాలనీ ఫీడర్ పరిధిలోని విద్యుత్‌లైన్‌ల కింద ఉన్న చెట్ల కొమ్మల తొలగింపు కారణంగా శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్ పాండరి శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కుషాల్‌నగర్, బృందావన్‌కాలనీ, మణికంఠకాలనీ, ఆదర్శ నగర్, కొత్త బస్టాండ్, ఎల్ఐసీ కాలనీ, శ్రీనివాస్‌నగర్, సాజీద్‌పుర, టిలికంనగర్, మహాశక్తినగర్, కేసీఆర్ నగర్, విద్యానగర్ ప్రాంతాలలో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని తెలిపారు.

సాగునీరు అందించడంలో విఫలం

పంటలను పరిశీలించిన బీఆర్ఎస్ నాయకులు

సిద్దిపేటరూరల్: కాంగ్రెస్ ప్రభుత్వం సకాలంలో రైతులకు సాగునీటిని అందించడంలో విఫలమైందని బీఆర్ఎస్ పార్టీ నాయకులు ఆరోపించారు. మండల పరిధిలోని అంకంపేట గ్రామ చెరువులోకి కాళేశ్వరం నీరు రాకపోవడంతో శుక్రవారం వారు ఎండిపోయిన పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఎప్పటికప్పుడు రైతులకు కాళేశ్వరం ద్వారా రంగనాయకసాగర్, మల్లన్నసాగర్ ద్వారా సరైన సమయంలో సాగునీటిని అందించి రైతులను ఆదుకున్నారన్నారు. పంటలు చేతికొచ్చే సమయంలో సాగునీరు లేక రైతులు బాధలు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రుణమాఫీ, విద్యుత్, సాగునీరు వంటి సమస్యలతో నిత్యం ఏదో ఒక చోటు రైతులు ధర్నా చేస్తున్నారని, వెంటనే వ్యవసాయశాఖ అధికారులో సమీక్ష నిర్వహించి రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలన్నారు కార్యక్రమంలో మాజీ ఎంపీపీ శ్రీదేవి, ఆత్మకమిటీ మాజీ చైర్మన్ ప్రభాకర్‌వర్మ, సర్పంచ్‌ల ఫోరం మాజీ అధ్యక్షుడు కిషన్‌రెడ్డి, మాజీ సర్పంచ్‌లు ఉదయశ్రీ, వీణా, హంసకేతన్‌రెడ్డి, తిరుపతి పాల్గొన్నారు.



వరి పంటను చూపుతున్న నాయకులు

సాగునీరు విడుదల చేయాలని వినతి

జగదేవ్‌పూర్(గజ్వేల్): భూగర్భ జలాలు అడుగంటడంతో బోరుబావుల్లో నీళ్లు రాక పంటలు ఎండిపోతున్నాయని, సాగునీటిని అందించి పొలాలను కాపాడాలని కోరుతూ నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు, తీగుల్ మాజీ సర్పంచ్ కప్పర భానుప్రకాశ్‌రావు నీటిపారుదల శాఖ అధికారులకు విన్నవించారు. మండల పరిధిలోని మునిగడప, తీగుల్ గ్రామాలకు చెందిన రైతులు, నాయకులతో కలిసి గజ్వేల్‌లో నీటిపారుదలశాఖ అధికారులు చాందీరాము, శ్రీధర్‌కు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కొండపోచమ్మ జలాశయం నుంచి జగదేవ్‌పూర్ నుంచి రాంనగర్ వరకు ఉన్న కాలువను పూర్తి చేసి మునిగడప పెద్ద చెరువులోకి, అదే విధంగా పాములపర్తి, చేబర్తి నుంచి కూడవెల్లి వాగులోకి సాగునీటిని విడుదల చేయాలని అధికారులకు విన్నవించామన్నారు. త్వరలో పీసీసీ అధికార ప్రతినిధి బండారు శ్రీకాంత్‌రావు ఆధ్వర్యంలో జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొండా సురేఖ, ఇరిగేషన్ శాఖ మంత్రి ఉత్తం కుమార్‌రెడ్డిని కలిసి మాట్లాడామన్నారు.

సీతారామ చంద్ర స్వామి ఆశీస్సులు ఉండాలి

ఎమ్మెల్సీ యాదవరెడ్డి

మర్కూక్(గజ్వేల్): శ్రీ సీతారామ చంద్ర స్వామి ఆశీస్సులు ప్రజలపై ఎల్లప్పుడు ఉండాలని ఎమ్మెల్సీ యాదవరెడ్డి తెలిపారు. మండలంలోని పాములపర్తి వార్షికోత్సవాలు శుక్రవారం అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమానికి హజరై ఆయన స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. అంతకుముందు ఆలయ వ్యవస్థాపక సభ్యులు హన్మంతరావు ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం రేపు9న ప్రతిష్ఠించే విమాన గోపుర సుదర్శన చక్రంను గ్రామంలోని ఎల్లమ్మ దేవాలయం నుంచి రామాలయం వరకు ఊరేగింపుగా తీసుకువచ్చారు. కార్యక్రమంలో పాండుగౌడ్, రాంచంద్రం యాదవ్, బాల్‌రెడ్డి, కనకయ్య, తదితరులు పాల్గొన్నారు.



స్వామిని దర్శించుకుంటున్న ఎమ్మెల్సీ యాదవరెడ్డి

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించండి

జిల్లా విద్యాశాఖ అధికారి శ్రీనివాస్ రెడ్డి

దుబ్బాకటౌన్: ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయులు విద్యార్థులకు మెరుగైన విద్యా బోధన అందించాలని సిద్దిపేట జిల్లా విద్యాశాఖ అధికారి శ్రీనివాస్‌రెడ్డి సూచించారు. శుక్రవారం దుబ్బాక మున్సిపల్ పరిధిలోని ధర్మాజీపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాల, భవిత సెంటర్‌ను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. తరగతి గదిలోకి వెళ్లి పిల్లల సామర్థ్యాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం రికార్డులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలలో మధ్యాహ్న భోజనానికి వినియోగించే కూరగాయలు, వంట పాత్రలు ఎప్పటికప్పుడు పరిశీలించి పిల్లలకు నాణ్యమైన భోజనం అందించాలని కార్మికులకు సూచించారు. మధ్యాహ్న భోజనంలో నాణ్యత లోపిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎంఈఓ ప్రభుదాస్, ప్రధానోపాధ్యాయుడు సాదత్ అలీ, ఉపాధ్యాయులు, తదితరులున్నారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న శ్రీనివాస్‌రెడ్డి

సీసీ రోడ్ల పనులు ప్రారంభం



సీసీ రోడ్డు పనులు ప్రారంభిస్తున్న పర్వతాలు

చేర్యాల(సిద్దిపేట): మండలంలోని పోతిరెడ్డిపల్లి, నాగపురి, ముస్త్యాల గ్రామాల్లో ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో చేపడుతున్న సీసీ రోడ్డు పనులను శుక్రవారం బీఆర్ఎస్ నాయకులు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎమ్మెల్యే డా.పల్లా రాజేశ్వర్‌రెడ్డి సీసీ రోడ్ల కోసం నిధులు మంజూరు చేయించారన్నారు. అందులో భాగంగానే గ్రామాల్లో సీసీ రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించినట్లు తెలిపారు. కార్యక్రమాల్లో బీఆర్ఎస్వీ రాష్ట్ర నాయకుడు పర్వతాలు, మాజీ ఎంపీపీ కరుణాకర్, మాజీ సర్పంచుల ఫోరం అధ్యక్షుడు యెల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మహిళా వాణిజ్య శాస్త్ర ఎగ్జిబిషన్

సిద్దిపేట ఎడ్యుకేషన్: స్థానిక ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల సిద్దిపేటలోని వాణిజ్య శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో విద్యార్థులు శుక్రవారం వాణిజ్య ఎగ్జిబిషన్ నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఏర్పాటు చేసిన వివిధ రకాల వాణిజ్య సముదాయాలను కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జీవన్ కుమార్, అధ్యాపక, అధ్యాపకేతర బృందం సందర్శించి విద్యార్థులు తయారుచేసిన వివిధ రకాల తెలంగాణ సాంప్రదాయక తినుబండారాలను కొనుగోలు చేశారు. వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ శ్యాము, శ్వేత, స్రవంతి, సువర్ణ దేవి, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ రాజీ మార్గమే రాజమార్గం: సీఐ

సిద్దిపేటజోన్: రాజీ మార్గమే రాజ మార్గమని ట్రాఫిక్ సీఐ ప్రవీణ్ కుమార్ అన్నారు. స్థానిక విక్టరీ టాకీస్ చౌరస్తాలో స్థానికులు, వాహన దారులకు శుక్రవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా కేంద్రంలో శనివారం జాతీయ మెగా లోక్ అదాలత్ నిర్వహిస్తున్నారని, రాజీ పడదగిన కేసులను పరిష్కరించుకోవాలన్నారు. అలాగే ట్రాఫిక్ నిబంధనల గురించి వివరించారు.

◆ వినియోగంలోకి తీసుకొస్తాం

దుబ్బాకటౌన్: దుబ్బాక రామసముద్రం చెరువుకట్ట సుందరీకరణలో భాగంగా రూ.10 లక్షలతో ఏర్పాటు చేసిన అత్యాధునిక టాయిలెట్స్‌ను త్వరలోనే పూర్తిస్థాయిలో వినియోగంలోకి తీసుకువస్తామని మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి చెప్పారు. చెరువు కట్టపై కొనసాగుతున్న పిచ్చి మొక్కల తొలగింపు, పారిశుద్ధ్య పనులు, నిరుపయోగంగా ఉన్న టాయిలెట్స్‌ను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ టాయిలెట్స్ సమీపంలో పాడైన బోరుకు మరమ్మతులు చేయించి, టాయిలెట్స్‌ని శుభ్రపరచి వారం రోజుల్లో అందుబాటులోకి తెస్తామన్నారు. మున్సిపల్‌లో పెండింగ్‌లో ఉన్న ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల ఫీజులను, ఇంటి నల్లాల పన్నులను సకాలంలో చెల్లించి మున్సిపల్ అభివృద్ధికి సహకరించాలని ప్రజలను కోరారు. ఏఈ శ్రీకాంత్, అనిల్ రెడ్డి, సిబ్బంది ప్రవీణ్, దిలీప్ కుమార్ పాల్గొన్నారు.

◆ సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన

బెజ్జంకి(సిద్దిపేట): మండలంలోని దేవక్కపల్లె సమ్మక్క సారాలమ్మ జాతర ప్రాంగణంలో సీసీ రోడ్డు పనులకు శుక్రవారం శంకుస్థాపన చేశారు. కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ ఈజీఎస్ నిధుల నుంచి రూ.10 లక్షలు మంజూరు చేసినట్లు కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యదర్శి మహిపాల్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ విజయలక్ష్మి, ఆలయ కమిటీ చైర్మన్ సంజీవరెడ్డి, నాయకులు అజయ్‌వర్మ, శ్రీనివాస్‌రావు, బీజేపీ మండల అధ్యక్షుడు రాజు తదితరులు పాల్గొన్నారు.

◆ మద్యం తాగి నడిపితే చర్యలు

గజ్వేల్‌రూరల్: మద్యం తాగి వాహనాలు నడిపితే చర్యలు తప్పవని ట్రాఫిక్ సీఐ మురళి హెచ్చరించారు. మున్సిపాలిటీ పరిధిలోని ప్రధాన చౌరస్తాల వద్ద ఇటీవల నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్‌లో 11 మంది పట్టుపడ్డారు. వారిని శుక్రవారం కోర్టులో హాజరుపర్చగా న్యాయవాది ప్రియాంక రూ.7వేలు జరిమానా విధించినట్లు తెలిపారు.

◆ సైబర్ నేరాలపై అవగాహన అవసరం

హుస్నాబాద్‌రూరల్: విద్యార్థులు సైబర్ నేరాలపై అవగాహన పెంచుకోవాలని సీఐ శ్రీనివాస్ సూచించారు. శుక్రవారం మహాత్మ జ్యోతిరావ్‌పూలే బాలికల గురుకుల పాఠశాలలో విద్యార్థులకు చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గుర్తు తెలియని వ్యక్తులతో జాగ్రత్తగా ఉండాలన్నారు. కార్యక్రమంలో షీటీమ్ సభ్యులు, ప్రిన్సిపాల్ వీణచందన, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.